క్లుప్తంగా

టి.సదుంలో కార్డెన్ సర్చ్



రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం లో పోలీసులు మంగళవారం కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఎస్ఐ రవీంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసు బలగాలు గ్రామంలో కవాతు చేపట్టాయి. అనంతరం ఇళ్లను క్షుణంగా తనిఖీ చేసి నిషేధిత వస్తువులు, రికార్డులు లేని వాహనాల వివరాలను ఆరా తీశారు. ఎన్నికల కౌంటింగ్ సమయాల్లో ప్రజలంతా స్నేహ పూర్వకంగా ఉండాలని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ఎస్పీఎం బదిలీ

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలోని తపాలా శాఖలో పని చేస్తున్న సబ్ పోస్ట్ మాస్టర్ (ఎస్పీఎం) రెడ్డిశేఖర్ బి.కొత్తకోటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బి.కొత్తకోట ఎస్పీఎం రాజారెడ్డి నియమితులయ్యారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్



పెద్దతిప్పసముద్రంలో కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రౌడీ షీటర్లకు మదనపల్లి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో గ్రామాల్లో అలజడులు సృష్టించినా, గొడవలకు ప్రేరేపించినా పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఏ రాజకీయ పార్టీ నాయకులు గెలిచినా టపాకాయలు, బాణ సంచా పేల్చి సంబరాలు చేసుకోరాదని హితబోధ చేసారు. అనంతరం కర్నాటక సరిహద్దులోఉన్న చెక్‌పోస్టులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన వెంట ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, ములకలరువు సీఐ తమ్మిశెట్టి మధు, దిశ సీఐ నాగేంద్ర, స్థానిక ఎస్ఐ రవీంద్రబాబు పాల్గొన్నారు.

30న మండల సర్వసభ్య సమావేశం

కేవీపల్లె : కేవీపల్లె మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యస్.యాదవేంద్ర తెలిపారు. ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో శాఖల వారీగా ప్రగతి చదివి వినిపించడం జరుగుతుందని తెలిపారు.

కొలువుల జాతర

రాజంపేట : రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్‌రైజ్ ఫార్మసిటికల్ అధినేత సతీష్ మాట్లాడుతూ ఐటీలలో చదువుకున్న నిరుద్యోగులు చాలా మంది ఉన్నారన్నారు. అతి చిన్న వయసులో మంచి మంచి కంపెనీలలో ఉద్యోగాలు రావడం హర్షణీయమన్నారు. ప్రిన్సిపల్ డా.సుధాకర్ మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్‌లో 39 మంది, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 31 మంది పాసయ్యారన్నారు. వీరికి క్యాంపస్ సెలక్షన్‌లో మంచి జీతం, మెరుగైన సదుపాయాలతో ఉద్యోగాలు రావడం శుభపరిణామమన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.పి.సుజాత మాట్లాడుతూ డిప్లమా పూర్తి చేసుకున్న విద్యార్థులు రూ.25 నెల జీతంతో మిగిలిన అలవెన్సులు పొందుతూ వారి తల్లితండ్రులపై ఆర్థికభారం మోపకుండా సంస్థ ద్వారానే ఉన్నత చదువులకు సదుపాయం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెలకువలు తెలియజేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకట్రామయ్య

తంబళ్లపల్లె : కిశోర బాలికలు, యువతులకు నెలసరి సమయంలో పాటించాల్సిన మెలకువలు తెలియజేయాలని డాక్టర్ వెంకట్రామయ్య సూచించారు. సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిలో రుతు పరిశుభ్రత దినం నిర్వహించారు. గైనకాలజిస్టు డాక్టర్ తేజశ్విని తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాలికలకు తల్లి జాగ్రత్తలను సూచించాలన్నారు. డాక్టర్ రిచర్డ్స్ పాల్గొన్నారు.

ఫీజు దోపిడీపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి లవకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహులు మంగళవారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో డిమాండ్ చేశారు. ప్రైవేటు యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్‌ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారంటూ ఆరోపించారు.

అట్టహాసంగా గంగజాతర ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో కోర్టులో గంగమ్మ

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలో గంగమ్మ జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. తొలుత అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు చీర, సారె సమర్పించి నిమ్మకాయలతో దీపాలు వెలిగించారు. అమ్మా గంగమ్మ తల్లీ కరుణించమ్మా అంటూ ప్రణమిల్లారు. పాడిపంటలతో వర్ధిల్లేలా దీవించాలని ప్రార్థించారు. భక్తి శ్రద్ధలతో తల్లిని పూజించి పులకించిపోయారు. స్థానిక అమిమినేనివీధి, రాటకొండవీధిలోని గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ఎన్టీఆర్ సర్కిల్, సొసైటీ కాలనీ, అమినేని వీధి, కజిన్స్‌రోడ్డు, రాటకొండవీధి, బెంగుళూరులో అమ్మవారి విద్యుత్తు కటౌట్లు ఏర్పాటు చేశారు. కోర్టు ఆవరణంతా భక్తులతో కిటకిటలాడింది. జాతర సందర్భంగా గంగమ్మ తల్లి, రాక్షసుడు, ఇతర దేవతల వేషదారణతో ఆలయం ఎదుట పలువురు విన్యాసాలు ప్రదర్శించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

పట్టు వస్త్రాల సమర్పణ

గంగమ్మ జాతర సందర్భంగా ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయం నుంచి ఊరేగింపుగా చేరుకుని దేవాదాయశాఖ ఈవో రమణ, మాజీ చైర్మన్ పాండు గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులకు పట్టువస్త్రాలను అందజేశారు.

నేడు విశ్వరూప దర్శనం

బుధవారం తెల్లవారుజామున అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. నిజ రూప దర్శనంతో అమ్మవారిని దర్శించుకోనున్నారు. భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటుచేసి పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మార్పురి చిన్న రెడ్డప్ప, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, భవానీ ప్రసాద్, రంగస్వామినాయుడు ప్రభాకర్, మహేష్ తదితరులు పర్యవేక్షించారు.





అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తున్న వెంకటరమణస్వామి ఆలయ కమిటీ సభ్యులు, ఆలయం ఎదుట విచిత్ర వేషధారులు

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం తలపులలో రుతుక్రమం, పరిశుభ్రతపై మహిళలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ జీవితంలో రుతుక్రమం ఒక సహజమైన ప్రక్రియ అని తెలిపారు. మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత, శానిటరీ నాప్కిన్స్, చాలినంత పౌష్టికాహారం తీసుకోవాలని, చేతులు శుభ్రత పాటించాలని సూచించారు. తద్వారా ఆరోగ్య సమస్యల నుంచి కాపాడుకోవచ్చునని తెలిపారు. రుతుక్రమం సందర్భంగా నొప్పి, అసాధారణ రక్తస్రావం లాంటి సమస్యలు ఉంటే దగ్గర్లోని పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఏఎన్ఎం నాగవేణి, కిషోరబాలికలు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో ఫారంపాండ్లు



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీడీ నందకుమార్‌రెడ్డి

పీలేరురూరల్ : ఉపాధి హామీ పథకం నిధులతో రైతులకు మేలు జరుగుతుందని కలికిరి ఏపీడీ నందకుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని తలపుల, మేళ్లచెరువులో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి నిధులతో రైతుల పొలాల్లో ఫారంపాండ్లు, బౌండరీలు, కందకాల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కలికిరి క్లస్టర్‌లో 800 మంది రైతులు 1750 ఎకరాల్లో పండ్లతోటలు పెంచుతున్నారన్నారు. 2వేల మంది రైతులకు పశుగ్రాసం కల్పించినట్లు తెలిపారు. పీలేరు మండలంలో 2050 మంది కూలీలు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మహేశ్వర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు పరిశుభ్రత పాటించాలి





సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దేవశిరోమణి, హాజరైన వైద్య సిబ్బంది

మదనపల్లె సిటీ : నెలసరి సమయంలో మహిళలు పరిశుభ్రత పాటించాలని, వారికి అవగాహన కల్పించే బాధ్యత ఆరోగ్య కార్యకర్తలపై ఉందని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దేవశిరోమణి అన్నారు. మదనపల్లె పట్టణంలోని ఎన్‌జీఓ హోం కార్యాలయంలో ప్రపంచ రుతుచక్ర దినోత్సవం నిర్వహించారు. దేవశిరోమణి మాట్లాడుతూ వయస్సు వచ్చినప్పుడు యువతులు నాటి ఆచారాలు, సంప్రదాయాలు పాటిస్తున్నారన్నారు. సిబ్బంది పాఠశాలకు వెళ్లి బాలికలకు నెలసరి సమయంలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ అనుపమ మాట్లాడుతూ నెలసరి సమయంలో ప్యాడ్‌లు ఉపయోగించాలన్నారు. ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ నిశ్శబ్దాన్ని ఛేదించి మహిళలందరూ సిగ్గు, బిడియం లేకుండా మాట్లాడాలని తెలిపారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్‌లలో ఉచిత శానిటరీ ప్యాడ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో

రాజంపేట టౌన్: ఆత్మరక్షణకు తైక్వాండో దోహదపడుతుందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని న్యూ ఆంధ్ర కళ్యాణ మండపంలో తైక్వాండో క్రీడాకారులకు మంగళవారం నిర్వహించిన బెల్ట్ పరీక్షలలో ఉత్తీర్ణులకు అమర్‌నాథరెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ ఆడపిల్లలకు తల్లిదండ్రులు ఆత్మరక్షణ క్రీడల్లో శిక్షణ ఇప్పించాలని తెలిపారు. క్రీడతో కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు కోచ్‌లు తెలియజేసి, పిల్లల్లో ఆసక్తి పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, సుధాకర్‌బాబు, జ్ఞానసాయి, మనోజ్‌కుమార్, డాక్టర్ కృష్ణ, డాక్టర్ విన్య, వైఎస్సార్ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రత



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం : మహిళల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తామని ఆర్‌బీఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్ అన్నారు. అంతర్జాతీయ ఋతుస్రావ ఆరోగ్య, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మండలంలోని గండబోయనపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో మహిళలు, కిశోర బాలికలకు ఋతుస్రావ సమస్యలు, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఋతుస్రావ సమయంలో సిగ్గు, బిడియం, భయపడటం జరుగుతుందని, శుభ్రతపై తల్లులు వారి కుమార్తెలకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

నాకాబందీ

సిద్దవటం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలోని దేగనవాండ్లపల్లెలో నాకాబందీ, కార్డెన్ సెర్చ్ మండళవారం నిర్వహించామని ఒంటిమిట్ట ఎస్ఐ పురుషోత్తం రాజ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు, ఊరేగింపులు చేయకూడదని గ్రామ ప్రజలకు సూచించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలను పాటించాలన్నారు. గ్రామాల్లో కక్షపూరితంగా గొడవలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావు, పోలీసులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాలపై అవగాహన



బీసీజీ టీకాపై అవగాహన కల్పిస్తున్న టీబీ యూనిట్ అధికారి ప్రభాకర్

మదనపల్లె : టీబీ నివారణకు వేస్తున్న బీసీజీ టీకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్.అనుపమ అన్నారు. పట్టణంలోని ఎన్‌జీఓహోంలో జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... 2025 నాటికి పూర్తి స్థాయిలో టీబీ నివారణకు బీసీజీ వ్యాక్సినేషన్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి గురువారం సంబంధిత సచివాలయాల్లో 18 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం మూడు నెలల పాటు కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ వాక్సినేషన్‌లో భాగస్వామ్యులు కావాలన్నారు. గర్భిణులు పాలిచ్చు తల్లులు, క్యాన్సర్, హెచ్ఐవీ పేషెంట్లకు టీకా అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ విభాగ అధికారి ప్రభాకర్, మహీ, దయాలన్, శాంతి, వనజకుమారి, సుశీల, తరుణ్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఈసీ నిబంధనల మేరకే నడచుకోవాలి

ఆర్వోలు హరి ప్రసాద్, రాఘవేంద్ర



కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న ఆర్వోలు హరిప్రసాద్, రాఘవేంద్రలు

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సూపర్ వైజర్లు, ఏజెంట్లు నిబంధనల మేరకు నడచుకోవాలని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గ ఎన్నికల అధికారులు హరిప్రసాద్, రాఘవేంద్ర పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియపై జరిగిన సమావేశంలో ఆర్వోలు మాట్లాడుతూ...కౌంటింగ్ ఏజెంట్లతో సూపర్‌వైజర్లు సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో ఫారం-17సీ పార్ట్-2 ఎంతో కీలకమైందన్నారు. ప్రతి కౌంటింగ్ ఏజెంట్, పరిశీలకులు, సహాయ పరిశీలకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం-17సీలో పొందుపరచిన ఓట్లు సరిపోల్చి చూడాలన్నారు. కౌంటింగ్‌లో చిన్న పొరపాటు జరిగినా, అజాగ్రత్తగా ఉన్నా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ జాగరూకతతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వోలు రమాదేవి, డీఎల్‌డీఓ లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ తిరుణాల



అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మతల్లి

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ గ్రామదేవత పోలేరమ్మతల్లి తిరునాల మంగళవారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని దౌలత్‌ఖాన్‌పల్లె గ్రామస్థులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ పరిసరాల్లో బెంగళూరు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన చాందినీ బండలతో జానపద నృత్యాలు చేస్తూ అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షణ చేశారు. మహిళలు చీర, సారె అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. రాత్రి అమ్మవారికి పూజల అనంతరం తిరుణాల ఉత్సవాలు ముగిశాయి.

దండాలమ్మా.. దండుమారెమ్మా



పూజలందుకుంటున్న దండుమారెమ్మతల్లి

తంబళ్లపల్లె : అమ్మా...దండుమారెమ్మా...దండాలమ్మా అంటూ కన్నెమడుగు, మద్రిమాకులపల్లె, ఎద్దులవారిపల్లె ప్రజలు అమ్మవారికి మొక్కుకున్నారు. కన్నెమడుగులో వెలసిన దండుమారెమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి జాతర వైభవంగా నిర్వహించారు. పూజారి శంకర్‌రెడ్డి అమ్మవారిని అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. విద్యుద్దీపాలతో అలంకరించిన చాందినీ బండ్ల మెరవణి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రవిశంకర్‌రెడ్డి(చినబాబు), ఎంపీటీసీ సభ్యులు మహేష్, శివశంకర్‌రెడ్డి, నిర్మలమ్మ, రాజశేఖర్‌రెడ్డి, పుష్పలత, వెంకటశివారెడ్డి, రఘురామిరెడ్డి, గణపతిరెడ్డి, సిద్దారెడ్డి, దశరథ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీఐ సద్గురుడు

రామసముద్రం : శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా అల్లర్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మదనపల్లె సీఐ సదుర్గుడు, ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల లెక్కింపు పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. చట్టాన్ని వ్యతిరేకించే విధంగా వ్యవహరించవద్దని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులకు సంబంధించిన వ్యక్తులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు చేయరాదన్నారు. రౌడీషీటర్లు , నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. ప్రతి గ్రామంలో పల్లెనిద్ర చేయాలన్నారు. గ్రూపులుగా మద్యం తాగి గొడవలు సృష్టిస్తే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు



ఫ్లాగ్ మార్చ్‌లో సీఐ పులిశేఖర్, పోలీసులు,

వాల్మీకిపురం : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జూన్ 4వ తేదీ వరకు నిఘా ఉంటుందని, ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వాల్మీకిపురం సీఐ పులిశేఖర్ అన్నారు. మండలంలోని చింతపర్తి, మేకలవారిపల్లి, ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో మంగళవారం బీఎస్ఎఫ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లు లెక్కింపు రోజున గుంపులు గుంపులుగా గుమికూడదన్నారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ తప్పకుండా నిబంధనలు పాటించాలన్నారు. కౌంటింగ్ తర్వాత రోజుల్లోనూ ర్యాలీలు, బాణసంచా పేలుళ్లు నిషేధమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నాగేశ్వరరావు, క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి వేరుశనగ విత్తనకాయల పంపిణీ

ఖరీఫ్ సీజన్‌లో భాగంగా అన్నమయ్యజిల్లా మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో రైతులకు రాయితీపై వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధమైంది. బుధవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు విత్తన కాయలు అందజేయనున్నారు.



పీటీఎం ఆర్‌బీకేలో పంపిణీకి సిద్ధంగా ఉన్న విత్తన కాయలు



కురబలకోటలో సిద్ధంగా ఉన్న విత్తన కాయలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రైతులకు రాయితీపై వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తామని ఏవో ప్రేమలత తెలిపారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు మాత్రమే విత్తన కాయలు అందజేస్తామన్నారు. రైతుల భూమి విస్తీర్ణాన్ని బట్టి కాయలు ఇవ్వరని, ప్రతి రైతుకు మూడు బస్తాలకు మించి ఇవ్వమని పేర్కొన్నారు. మండలంలో ఇప్పటి వరకూ 7,757 బస్తాల వేరుశనగ విత్తన కాయలు ఆర్‌బీకేల్లో పంపిణీకి సిద్ధంగా ఉంచామన్నారు. పంపిణీ సజావుగా జరిగేందుకు రైతులందరూ సహకరించాలని ఏవో కోరారు.

ఆర్బీకేల్లో విత్తనకాయలు

నిమ్మనపల్లె : మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో రాయితీపై వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయడం జరుగుతుందని వ్యవసాయాధికారి మురళీ మోహన్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని పర్మిట్లు పొందిన వారంతా విత్తనకాయలు తీసుకోవాలని కోరారు. మండలానికి 120 క్వింటాళ్ల జనుము, పచ్చి రొట్ట విత్తనాలు కేటాయించడం జరిగిందన్నారు. ఆర్‌బీకేలలో 50శాతం రాయితీతో ఒకో బ్యాగు ధర రూ.440 చెల్లించి పొందవచ్చన్నారు.

రాయితీపై విత్తనం

పీలేరు రూరల్ : ఖరీఫ్ సాగుకు నేటి నుంచి రాయితీపై వేరుశెనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏడీఏ వై.వి.రమణరావు తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి పీలేరు, కేవీపల్లె మండలాల్లోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వేరుశెనగ విత్తన కాయలు అందుబాటులో ఉంచుతామన్నారు. పీలేరులో 1727, కేవీపల్లెలో 2100 క్వింటాళ్ల విత్తనకాయలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ రాయితీ 40 శాతం పోనూ 30 కిలోల బస్తా రూ.1746తో రైతులు కొనుగోలు చేయవచ్చునని పేర్కొన్నారు. 50 శాతం రాయితీతో జనుమువిత్తనం ఇస్తున్నట్లు చెప్పారు.

రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే..

కురబలకోట : మండలంలో బుధవారం నుంచి వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి ఎస్.రాధ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఆయా ఆర్బీకే కేంద్రాల వద్ద విత్తన కాయలు పంపిణీ చేస్తారన్నారు. ఇప్పటివరకు మండలానికి కేసిక్స్ రకం కాయలు 2వేల వేల క్వింటాళ్లు వచ్చాయన్నారు. జలుము, జీలుగ అవసరమైన రైతులకు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.